




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
మార్చి 24,2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## 5 రోజులు దాడులకు విరామం: ట్రంప్

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తాత్కాలిక ఉపశమనం
- దాడులు వాయిదా వేయాలని సైన్యానికి ఆదేశం
- ఇంధన కేంద్రాలపై దాడులు 5 రోజులు నిలిపివేత
- చమురు మార్కెట్లలో భారీ పతనం..
- 'ట్రంప్ వెనక్కి తగ్గారు' అంటూ ఇరాన్ వ్యాఖ్యలు



2లో




### క్యూనెట్ మోసం బట్టబయలు..

## 32మంది అరెస్టు

3 రాష్ట్రాల్లో సోదాలు.. సీసీఎస్ భారీ ఆపరేషన్

30 బృందాలతో దాడులు.. కీలక నిందితుల పట్టివేత

ఐటీ ఉద్యోగులే ఎక్కువగా నిందితుల్లో ఉండటం విశేషం

## సన్న బియ్యానికి బోనస్ తప్పదు

- రైతులకు అండగా నిలుస్తాం: మంత్రి ఉత్తమ్
- ధాన్యం కొనుగోళ్లలో రికార్డు.. 72 లక్షల టన్నులు సేకరణ
- ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న భరోసా
- రబీ సీజన్‌లోనూ పూర్తి స్థాయి కొనుగోళ్లు



2లో

## ప్రజలకు ఎటువంటి

# నష్టం ఉండదు



- మెరుగైన వసతులతో పునరావాసం.. ఎవరినీ నిరాశ్రయులను చేయం
- అపోహలు నమ్మొద్దు.. రాజకీయాల కోసం ప్రజలను రెచ్చగొట్టొద్దు
- సూచనలు ఇస్తే స్వాగతం.. అవసరమైతే కేబినెట్ సబ్ కమిటీ
- మూసీ ప్రక్షాళన తప్పనిసరి.. కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- హైదరాబాద్ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్.. మెట్రో విస్తరణ, కారిడార్లు
- ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం.. అండర్‌పాస్, ఎలివేటెడ్ ప్రాజెక్టులు

2లో



## ఏపీలో మెగా స్టీల్ సిటీ..

## రూ.1.36 లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్

- రూ.1.36 లక్షల కోట్లతో మెగా స్టీల్ ప్లాంట్‌కు శ్రీకారం
- నక్కపల్లిలో 'స్టీల్ సిటీ'గా అభివృద్ధి లక్ష్యం
- రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి టార్గెట్
- వేలాది ఉద్యోగాలు.. ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్పు


2లో

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో భారీ ఉక్కు పరిశ్రమకు అంకురార్పణ జరిగింది. సుమారు 1.36 లక్షల కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ పరిశ్రమకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు హెచ్.డి. కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాస వర్మ , మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నక్కపల్లిలో ఏర్పాటు కాబోతున్నది కేవలం ఒక స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదని, ఇది ఒక సంపూర్ణ 'స్టీల్ సిటీ'గా అవతరించబోతోందని ప్రకటించారు. గతంలో విశాఖ ఉక్కును పోరాడి సాధించుకుంటే, ఆర్సెలార్ మిట్టల్ సంస్థ మన రాష్ట్రంపై ఉన్న నమ్మకంతో ఇక్కడికి రావడం విశేషమని, కేవలం 20 నెలల కాలంలోనే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో ఈ మెగా ప్రాజెక్టును సాకారం చేసి చూపించామని ఆయన గర్వంగా పేర్కొన్నారు.

### బడ్జెట్‌లో అన్ని 'గాలి మాటలు'...

## వాస్తవాలకు దూరం!

- స్వచ్ఛత, స్పష్టత, విశ్వసనీయత కనిపించలేదు: హరీశ్
- హామీలకు అరకొర నిధులు.. మేనిఫెస్టోను మర్చిపోయారు
- రైతు రుణమాఫీ అమలు కాలేదన్న ఆరోపణ..
- బోనస్ 'బోగస్'గా మారిందని వ్యాఖ్య
- నిరుద్యోగులకు దక్కింది నిరాశే.. జాబ్ క్యాలెండర్ గల్లంతు
- సంక్షేమ పథకాల అమలులో తీవ్ర లోపాలు..
- యువత, మహిళలకు న్యాయం లేదని విమర్శ





## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..

### ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో పవన్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును

## కఠిన సవాళ్లకు రెడీ ఉండాలి



- లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన
- గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు.. అప్రమత్తంగా కేంద్రం
- భద్రతకు ప్రాధాన్యం.. వేల మంది స్వదేశానికి తరలింపు
- ముడి చమురు, వాణిజ్యంపై ప్రభావం.. ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు
- ఎల్పీజీ కొరత లేకుండా చర్యలు.. సరఫరాపై ప్రత్యేక దృష్టి
- ఇంధన దిగుమతుల విస్తరణ.. వ్యూహాత్మక నిల్వల పెంపు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం భారత్‌కు అనేక సవాళ్లను తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. లోక్‌సభలో మాట్లాడిన ఆయన, గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని చెప్పారు. ఈ పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తున్నామని తెలిపారు.

## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..

(మొదటి పేజీ తరువాయి)

మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దీని ద్వారా ఏటా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించడం అనేది ఈ ప్రాంత యువతకు గొప్ప వరం. ఆంధ్రప్రదేశ్‌పై, మా ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇంత భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినందుకు ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, సీఈఓ దిలీప్ ఉమెన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. పర్యావరణ శాఖ మంత్రి హోదాలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కర్బన ఉద్గారాలను (కార్బన్ ఫుట్‌ప్రింట్) పరిమితం చేసేలా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని తెలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్న సంస్థలను మేం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం" అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన అన్ని సహకారాలు అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, హోం మంత్రి అనిత, ఇతర మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## క్యూనెట్ మోసం బట్టబయలు.. 32మంది అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా కోట్ల రూపా యల మోసాలకు పాల్పడుతున్న క్యూనెట్ కేసు లో పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో 32 మంది నిందితులను అరెస్టు చేసి నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. మూడు రాష్ట్రాల్లో సమన్వ యంతో సోదాలు నిర్వహించి ఈ అరెస్టులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్ కోసం హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు 30 బృందాలుగా విడిపోయి విస్తృతంగా దాడులు నిర్వహించారు. నిందితుల నుంచి భారీగా ఒప్పంద పత్రాలు, లాప్‌టాప్‌లు మరియు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన వారిలో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులు ఉండటం గమనార్హమని పేర్కొ న్నారు. ఇప్పటివరకు నమోదైన నాలుగు కేసుల్లో కనీసం 11 మంది బాధితులు సుమారు రూ.75 లక్షల మేర మోసపోయినట్లు గుర్తించా మని సీపీ వివరించారు. ఈ మోసం మరింత విస్తృతంగా ఉండే అవకాశముందని భావిస్తూ, మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో జరిగే ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. ఇలాంటి పథకాలలో చేరడం, ఇతరులను చేర్పించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## సన్న బియ్యానికి బోనస్ తప్పదు

హైదరాబాద్ : సన్న బియ్యానికి బోనస్ ఇవ్వడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. శాసనసభలో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం రైతుపక్షపాత విధానాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. రైతుల నుంచి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే 72 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించి, రైతులకు నగదు చెల్లింపులు పూర్తి చేసినట్లు మంత్రి వివరించారు. ఇంకా మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రబీ సీజన్‌లో ప్రతి గింజను సేకరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కేంద్రం నుంచి నిధులు వచ్చినా రాకపోయినా, రైతులకు నష్టం కలగకుండా కొనుగోళ్లు కొనసాగిస్తామని చెప్పారు. తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని మంత్రి తెలిపారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 86 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉన్నదని, వాటిని ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సోనా మసూరి, బాస్మతి వంటి బియ్యాలకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మంచి డిమాండ్ ఉందని వివరించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి విమర్శలు చేశారు. ఆ ప్రభుత్వం హయాంలో బియ్యం కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత పాలనలో జరిగిన అన్ని అక్రమాలపై దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని తెలిపారు. మొత్తంగా రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపుల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం అందించే లక్ష్యంతో ముందుకు సాగుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు.

## 5 రోజులు దాడులకు విరామం: ట్రంప్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు గడువు విధించిన నేపథ్యంలో, ప్రస్తుతం జరుగుతున్న చర్చల కారణంగా ఇరాన్‌పై దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. గత రెండు రోజులుగా ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని ఇంధన మౌలిక వసతులు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజులపాటు వాయిదా వేయాలని సైన్యానికి ఆదేశించినట్లు తెలిపారు. చర్చల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో వెంటనే ప్రభావం కనిపించింది. ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి. ఒకే రోజులో గణనీయంగా తగ్గి, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి తగ్గిన సంకేతాలు కనిపించాయి. మరోవైపు, ట్రంప్ ప్రకటనపై ఇరాన్ భిన్నంగా స్పందించింది. తమ హెచ్చరికల కారణంగానే అమెరికా వెనక్కి తగ్గిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార మాధ్యమం పేర్కొంది. అయితే ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గలీబాఫ్ మాత్రం అమెరికాతో ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. మార్కెట్లను ప్రభావితం చేయడానికే తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

# ఏపీలో మెగా స్టీల్ సిటీ.. రూ.1.36 లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్లాంట్‌తో పాటు సుమారు 11,198 కోట్లతో ప్రత్యేక క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం కానుంది. పరిశ్రమకు అవసరమైన ముడి ఇనుము సరఫరా కోసం ప్రత్యేక పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నారు. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తిని ప్రారంభించి, 2030 డిసెంబర్ నాటికి రెండు భారీ బ్లాస్ట్ ఫర్నేస్‌లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భారీ పరిశ్రమ కేవలం ఉక్కు ఉత్పత్తికి మాత్రమే పరిమితం కాకుండా, ఆర్థిక లావాదేవీలతో పాటు విద్య, వైద్యం , వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా ఈ ప్రాంత రూపురేఖలను మార్చివేస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా అత్యంత వేగంగా భూసేకరణ , అనుమతులు ఇచ్చింది ఏపీలోనేనని, పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం ఉందని, నిపుణులు , మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతమని చంద్రబాబు పేర్కొన్నారు. టూరిజం నుంచి డేటా సెంటర్ల వరకు, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకు అన్నింటికీ ఇక్కడ మెండైన అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' అనే నినాదాన్ని విజయవంతం చేస్తామని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు కాబోతోందని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావడం రాష్ట్రానికి గర్వకారణమని, బీపీసీఎల్ వంటి పెద్ద పరిశ్రమలు కూడా ఇక్కడికి వస్తున్నాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల్లో రాష్ట్రానికి సుమారు 20.35 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ , ఐటీ సెంటర్లకు కీలక కేంద్రంగా మారుతుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని, ఈ ప్రాంతం త్వరలోనే రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా మారుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తామని, కొత్తగా పోర్టులు , విమానాశ్రయాలు వస్తున్నాయని, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా పూర్తి చేసేందుకు అన్ని రకాల సహకారం అందిస్తామని, భూములు ఇచ్చిన రైతులకు అండగా



ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరిశ్రమలో మొదటి ప్రాధాన్యతగా అనకాపల్లి జిల్లా యువతకే ఉద్యోగాలు కల్పించాలని సంస్థను కోరారు. ఆవిష్కరణల కోసం మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు సంస్థ ప్రతినిధులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

# కఠిన సవాళ్లకు రెడి ఉండాలి

ఎల్పీజీ సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రధాని పేర్కొన్నారు. ము ఖ్యంగా భారత్‌కు ముడి చమురు, వాయువు ఎక్కువగా గల్ఫ్ దేశాల నుంచే వస్తున్న నేపథ్యంలో ఈ యుద్ధం ప్రభావం మ రింతగా ఉంటుందని అన్నారు. వాణిజ్య రవాణా కూడా అంత రాయం ఎదుర్కొంటోందని తెలిపారు. ఆ ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారని, నౌకాయాన రంగంలో కూడా అనేక మంది భారతీయులు పనిచేస్తున్నారని చెప్పారు. వారికి అవసరమైన సహాయం అందించేందుకు భారత దౌత్య కార్యాలయాలు నిరంతరం కృషి చేస్తున్నాయని వెల్లడించారు. భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని స్పష్టం చేశారు. యుద్ధం ప్రారంభ మైనప్పటి నుంచి లక్షలాది మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారని తెలిపారు. విద్యార్థులను కూడా సురక్షితంగా తరలించే చర్యలు చేపట్టామని చెప్పారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షల నిర్వహణపై కూడా చర్యలు తీసుకు న్నామని వెల్లడించారు. ఇంధన అవసరాల విషయంలో కేంద్రం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దేశీయం గా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నామని, పెట్రోల్, డీజిల్ సర ఫరా సజావుగా కొనసాగేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఇంధన దిగుమతుల కోసం దేశాల సంఖ్యను గణనీయంగా పెంచినట్లు వివరించారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను కూడా పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇథనాల్ వినియోగాన్ని పెంచడం ద్వారా ముడి చమురు దిగుమతులను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నామని ప్రధాని చెప్పారు. ఈ సంక్షోభాన్ని ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి ఎదుర్కోగలవని విశ్వాసం వ్యక్తం చేశారు. యూరియా, ఎరువుల విషయంలో రైతులకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చివరగా, పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కోసం దౌత్య చర్చల మార్గాన్నే భారత్ ప్రోత్సహిస్తోందని ప్రధాని పునరుద్ఘాటించారు.



## బడ్జెట్‌లో అన్నీ 'గాలి మాటలు'... వాస్తవాలకు దూరం!

హైదరాబాద్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. బడ్జెట్‌లో స్వచ్ఛత, స్పష్టత, విశ్వసనీయత పూర్తిగా లోపించాయని, ఇది వాస్తవాల కంటే 'అవాస్తవాల కోట'లా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన భారీ హామీలకు సరిపడా నిధులు కేటాయించలేదని, ప్రజలను మోసం చేసే విధంగా బడ్జెట్‌ను రూపొందించారని ఆరోపించారు. రైతుల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, రైతు పరిస్థితి మరింత దారుణంగా మారిందని అన్నారు. 'అభయహస్తం' పేరుతో వచ్చిన పథకాలు రైతుల పాలిట 'భస్మాసుర హస్తం'గా మారాయని విమర్శించారు. గతంలో కరోనా కష్టకాలంలో కూడా రైతుబంధు అమలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతులకు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. పంటల బీమా ప్రస్తావన లేకపోవడం, బోనస్ చెల్లింపులు నిలిచిపోవడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలపై కూడా ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో దాని గురించి ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని, నిరుద్యోగులకు ఉపాధి కాకుండా నిరాశ మాత్రమే దక్కిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులపై ఒత్తిడి, నిర్లక్ష్యం పెరిగిందని ఆరోపించారు. యువత, మహిళల కోసం ప్రకటించిన పథకాలు కూడా అమలులో విఫలమయ్యాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'రాజీవ్ యువ వికాసం' వంటి పథకాలకు నిధులు కేటాయించినప్పటికీ, వాటి ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరలేదన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను బయటపెట్టాలని, లేకపోతే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం ప్రకటించిన పథకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. సంక్షేమం పేరుతో ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, వాస్తవంలో ఆ వర్గాల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని హరీశ్‌రావు ఆరోపించారు.

# ప్రజలకు ఎటువంటి నష్టం ఉండదు

హైదరాబాద్ : మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవ్వరికీ నష్టం జరగదని, ఎవరినీ నిరాశ్రయులను చేయబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు అమలు సమయంలో ప్రభావితులైన వారికి సముచిత పునరావాసం కల్పించి, మెరుగైన వసతులతో తరలిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు సృష్టిస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దని, రెచ్చగొట్టే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రాజెక్టును ఆపాలని కాకుండా, దాన్ని మెరుగ్గా అమలు చేసే దిశగా సూచనలు ఇవ్వాలని సీఎం కోరారు. అవసరమైతే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి సూచనను 100 శాతం అమలు చేస్తామని స్పష్టం చేశారు. మూసీ నది కాలుష్యం తీవ్రమైందని, నల్లగొండ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూస్తే ప్రక్షాళన అవసరం ఎంత ఉందో అర్థమవుతుందని సీఎం పేర్కొన్నారు. జంతువుల అవశేషాలు, మురుగు, కాలుష్యంతో నది నీళ్లు ప్రమాదకరంగా మారాయని, అది పంటలపై, భూగర్భ జలాలపై, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని వివరించారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం గోదావరి జలాలను మూసీలోకి తీసుకురావాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బఫర్ జోన్ అంశంపై మాట్లాడుతూ, గతంలో 9 మీటర్లుగా ఉన్న పరిమితిని 50 మీటర్లకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. దాని ప్రకారం కొన్ని నిర్మాణాలు సమస్యల్లో పడే అవకాశముందని, ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించడం కోసం



ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అవసరమైతే భూములకు నష్టపరిహారం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తామని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. 'తెలంగాణ రైజింగ్ 2047' దృష్టితో నగరాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను నగర బయటకు తరలించి, నివాసయోగ్యమైన నగరంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఒకే విధమైన పరిపాలన కోసం కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు, పోలీసు కమిషనరేట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మెట్రో రైల్వే విస్తరణపై మాట్లాడుతూ, గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టును ప్రభుత్వం తిరిగి చేపడుతోందన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకుని, నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు, గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట, రాయిదుర్గం నుంచి నియోపోలీస్ వరకు మొత్తం 76 కిలోమీటర్ల మేర విస్తరించనున్నట్లు వివరించారు. దీనికి కేంద్రం కూడా సహకరిస్తోందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, సర్ఫేస్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హిమాయత్‌సాగర్ నుంచి గౌరెల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ద్వారా నగర రద్దీ తగ్గుతుందని తెలిపారు. అలాగే బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం దేశంలోనే ప్రత్యేకమని పేర్కొన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యమని, వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామని సీఎం చెప్పారు. మల్టీ లెవల్ పార్కింగ్ వ్యవస్థలను కూడా ప్రవేశపెడుతూ నగర ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రభుత్వ స్థలాల్లో చొరబడితే కఠిన చర్యలు: బైరెడ్డి రాజేష్

**ప్రభుత్వ బోర్డును కప్పేశారు**

**ఫెన్సింగ్ తీగలను తెంపేశారు**

**చొరబడితే క్రిమినల్ కేసులు పెడతాం**







కాప్రా, వార్త మిర్రర్, మార్చి 23: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు. సర్వేనెంబర్ 376 ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డును కనిపించకుండా తాడ్పాల్, గోనెసంచులతో కప్పివేసి ఫెన్సింగ్ తీగలను తెంపేసి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయని తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ తెలిపారు. బైరెడ్డి తాసిల్దార్ రాజేష్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం కాప్రా మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్వర్ణలత సర్వే నెంబరు 376 ప్రభుత్వ భూమి సందర్శించారు. కాప్రా తహసిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోర్డును పూర్తిగా కనిపించకుండా కప్పివేసిన తీరును పరిశీలించి అందుకు కారణమైన వాళ్ళను తీవ్రంగా మందలించారు. వారితోనే వాటిని తొలగింప చేసి, ప్రభుత్వ స్థలంలో పార్కు చేసిన వాహనాలను తీసివేయాలని హెచ్చరించారు. మంగళవారం ఉదయం పది గంటల వరకు వాహనాలను ప్రభుత్వ స్థలం నుంచి తొలగించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని, అందుకు కారణమైన వారిపై క్రిమినల్ చర్యలు నమోదు చేస్తామని తెలిపారు. గతంలో కాప్రా తాసిల్దార్ గా పని చేసిన సుచరిత ఆధ్వర్యంలో ఎంతో విలువైన సుమారు 16 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి నిర్మాణ దశలో ఉన్న ఒక భవనాన్ని సీజ్ చేసిన విషయం విధితమే. సర్వేనెంబర్ 376 ప్రభుత్వ భూముల్లో గత తహసిల్దార్ స్వాధీనం చేసుకున్నప్పుడు ఏ విధంగా ఉందో అలాగే ఉండాలని తొలగించిన ఫెన్సింగ్ వైర్ ను తిరిగి ఏర్పాటు చేయాలని, ఇలాంటి ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేయరాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డును కనిపించకుండా చేస్తే ఉపేక్షించేది లేదని తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని అన్నారు.

# గోపీనగర్ ఈద్గా భూమి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి....

**జీహెచ్ఎంసీ ప్రజావాణిలో కమిషనర్, తహసీల్దార్ లకు వినతి...**

**హిందూ-ముస్లిం కమిటీలు, ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఫిర్యాదు....**





శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మిర్రర్ : శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపీనగర్ కాలనీలో గల ఈద్గా భూమిని అక్రమంగా ఆక్రమించుకోవాలని చూస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మోతీ మసీద్ ఈద్గా కమిటీ మరియు జనచైతన్య ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం నిర్వహించిన జీహెచ్ఎంసీ ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్‌కు, అలాగే శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ (డిప్యూటీ కలెక్టర్) కు వారు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 64/1 లో దశాబ్దాలుగా ముస్లిం కమ్యూనిటీ ఆధీనంలో ఉన్న ఈద్గా భూమిని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈద్గా వెనుక భాగంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, దీనివల్ల స్థానిక నివాసితులకు ఇబ్బందులు కలగడమే కాకుండా శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని బాపునగర్, గోపినగర్, నెహ్రూనగర్ కాలనీ వాసులు పేర్కొన్నారు. 1973 నుండి ఉన్న రికార్డుల ప్రకారం ఈ భూమి ఈద్గా ఆధీనంలో ఉందని, శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టాలని చూస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. తక్షణమే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన (స్థల పరిశీలన ) చేసి, కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఆక్రమణల నుండి ఈద్గా స్థలాన్ని కాపాడాలి.ఈ కార్యక్రమంలో జనచైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాజర్ఘాట్ రమేష్, మోతీ మసీద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ జాకీర్ అహ్మద్, నెహ్రూనగర్ నూరానీ మసీద్ అధ్యక్షులు గఫ్ఫార్, బాపునగర్ హనుమాన్ యూత్ అధ్యక్షులు రాజ్ కుమార్ ముదిరాజ్ మరియు బాపునగర్, గోపినగర్, నెహ్రూనగర్ కాలనీల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోపనపల్లిలో అక్రమ నీటి తరలింపు...

**తీవ్ర తాగునీటి సంక్షోభం, ఎమ్మార్వోకు గ్రామస్థుల ఫిర్యాదు...**



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గోపనపల్లి గ్రామంలో భూగర్భ జలాల అక్రమ వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుల కారణంగా తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై గ్రామస్థులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. గ్రామ పరిధిలో పెద్దఎత్తున బోర్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని వాణిజ్య అవసరాల కోసం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావంతో భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయి బోర్లు ఎండిపోయాయి. ప్రస్తుతం 1200 నుంచి 2000 ఫీట్లు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గ్రామ ప్రజలు రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు గ్రామస్థులు ట్యాంకర్లను అడ్డుకుని నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ తాత్కాలిక చర్యలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై సోమవారం (23-03-2026) గోపనపల్లి గ్రామస్థులు శేరిలింగంపల్లి ఎమ్మార్వో ( డిప్యూటీ కలెక్టర్) మహిపాల్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి అక్రమ నీటి తరలింపును అరికట్టడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి విచారణ జరిపి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు నాయక్, మూలగిరి శ్రీనివాస్, సురేందర్, శివకుమార్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాం నగర్ టుబిహెచ్‌కే సమస్యలు పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి**



కాప్రా, వార్త మిర్రర్, మర్చి 23 :కాప్రా సర్కిల్ పరిధిలోని శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు రాములు నాయక్, రవీందర్, గౌస్, షఫీ మాట్లాడుతూ కాలనీలోని వాణిజ్య సముదాయాలను వేలం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వాటిని కిరాయికి ఇస్తే వచ్చే ఆదాయం ద్వారా మెయింటెనెన్స్ ఖర్చుల భారం కొంతవరకు తగ్గుతుందని సూచించారు. కాలనీలో కనీస సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జీరో కరెంట్ బిల్లు అమలు చేయాలని, బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని, 117 నంబర్ బస్సును శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. భవనాల స్లాబులు ఊడి పెచ్చులు రాలుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. నీటి లీకేజీలను అరికట్టాలని తెలిపారు. లిఫ్ట్‌ల ఏఎంసీలను పొడిగించి, పనిలో లేని లిఫ్ట్‌లను తక్షణమే మరమ్మతులు చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ కాలనీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు వీధి దీపాలకు కేబుల్స్ వేయాలని కోరారు. సెల్లార్‌లో నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల సమస్యలపై కలెక్టర్ మను చౌదరి వెంటనే స్పందించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2బిహెచ్‌కే లబ్ధిదారులు బాబురావు, కిషన్, సతీష్, సైదులు, యాదగిరి, రాజిరెడ్డి, ఇస్మాయిల్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గౌరవం కోసం మా పోరాటం ఆగదు!

## అక్రమ కేసులకు భయపడం...



మహేశ్వరం వార్త మిర్రర్ ప్రతినిధి 23..తెలంగాణ గౌరవాన్ని కించపరచే ఏ చర్యనైనా మేము అసలు సహించము. ప్రజల విశ్వాసాన్ని మోసం చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే శక్తులను తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది కేవలం రాజకీయ పోరు కాదు ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం.ప్రజల హక్కులను తుంచే, అభివృద్ధిని అడ్డుకునే, తెలంగాణ స్వాభిమానాన్ని దిగజార్చే ఎవరైనా ఉంటే వారిపై ప్రజలే తీర్పు చెప్పే రోజు దగ్గరలోనే ఉంది. మా భూమి, మా గౌరవం, మా హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదు.మేము స్పష్టంగా చెబుతున్నాం తెలంగాణ ప్రజల స్వరాన్ని ఎవ్వరూ అణగదొక్కలేరు. ప్రజల శక్తి ముందు ఏ కుట్రలూ నిలవవు. ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే, కానీ గట్టిగా, ధైర్యంగా మా పోరాటం కొనసాగుతుంది.



# మొక్కజొన్నపై రైతు అవగాహన సదస్సు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 23

జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామం లో జగిత్యాల నీలకంఠ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ (ఎఫ్పిఓ) ఆధ్వర్యంలో రైతు దమ్మ చంద్ర రెడ్డి మొక్కజొన్న పంట లో అడ్వాంట కంపెనీ వారు అడ్వాంట, పిఏసి 741 మొక్కజొన్న రకం గురించి రైతు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలోఎఫ్ పిఓ చైర్మన్ ధమ్మ గంగారెడ్డి, సిఈఓ నాగిరెడ్డి అనిల్ కుమార్ కంపెనీ ప్రతినిధి జి .అభిలాష్ 3 గ్రామాల రైతులు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## .. బిఆర్ఎస్ పార్టీ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి




వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 23 : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజావ్యతిరేక పాలనపైమహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఎన్నికల ముందు గొప్పగా ప్రకటించిన పథకాలు ఇప్పటికీ అమలుకాలేదని రైతులు, నిరుద్యోగులు, పేద ప్రజలు నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు హామీ ఇచ్చిన ఆర్థిక సహాయం తగ్గించడం అన్యాయం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు పెన్షన్ల పెంపు గురించి స్పష్టత లేదు సంక్షేమ పథకాల అమలులో గందరగోళం ప్రభుత్వం మాటలు ఒకలా, పనులు మరోలా ఉండటం ప్రజలను మోసం చేయడమే. ఈ పరిస్థితిని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ప్రజల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుందని తెలిపారు




# అల్లీపూర్ లో ప్రపంచ జల, వాతావరణ దినోత్సవం వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్, మార్చి 23జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం (మార్చి 22), ప్రపంచ వాతావరణ దినోత్సవం (మార్చి 23) వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కిరణ్ నీటి సంరక్షణ గురించి మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నీటి సంరక్షణ, వేసవి దృష్ట్యా ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వాడుకోవాలని, భూగర్భ జల మట్టాలను పెంచేందుకు ఇంకుడు గుంతల ప్రాధాన్యతను వివరించారు. వాతావరణ రక్షణ గురించి జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీ బొమ్మకంటి రవికుమార్, మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. మొక్కలు నాటడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుండే పర్యావరణం పట్ల బాధ్యతగా ఉండాలని, నీటిని వృధా చేయకుండా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్ జిసి) సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు వసంతరావు, రాజశేఖర్, మహేష్, ఆనంద్, రాజన్న, రజిత, మల్లారెడ్డి, శంకరయ్య, కృష్ణ ప్రసాద్, జీవన్ రెడ్డి లు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# రామాజీపేటలో జరిగే సీతారాముల కళ్యాణానికి ఆహ్వానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 23

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో మార్చి 27 రోజున జరగబోయే సీతారాముల కల్యాణ మహోత్సవానికి ప్రముఖులకు ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ అధ్యక్షులు కోల రాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సోమవారం రోజు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావసంత సురేష్ లను ప్రత్యేకంగా మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ సీతారాముల స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించడం జరిగింది. అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామంలో జరిగే సీతారాముల కళ్యాణంలో మండల ప్రజలు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉప సర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ హరీష్ రావు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జుల మోహన్ రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు అనుపురం సత్యం గౌడ్, బీజేపీ గ్రామ అధ్యక్షులు బోయిని నరేందర్, కమిటీ సభ్యులు పాల్గొని ఆహ్వాన పత్రిక అందించారు.

# బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి

### తెలంగాణ రాజ్యాధికార పార్టీ ధ్వజం

కాప్రా, వార్త మిర్రర్, మార్చి 23 : తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ అంకెల గారడీ తప్ప సామాన్య ప్రజలకు, ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాలకు పైసా ప్రయోజనం లేని 'అప్పుల బడ్జెట్' అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్ జిల్లా నాయకులు ధ్వజమెత్తారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు సోమవారం కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో జిల్లా పార్టీ అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించాయి. ప్లకార్డులు చేతబూని, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో చౌరస్తాను హోరెత్తించారు.

*కామారెడ్డి డిక్లరేషన్ హామీలను గాలిక*

### బీసీలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బీసీలకు ఇచ్చిన 'కామారెడ్డి డిక్లరేషన్' హామీలను బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బీసీ సంక్షేమానికి ఏడాదికి రూ. 20,000 కోట్లు కేటాయిస్తామని గొప్పలు చెప్పిన పాలకులు, నేడు బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తకపోవడం బీసీలను దారుణంగా వంచించడమే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీపై ప్రభుత్వం మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు.42 శాతం రిజర్వేషన్లే మా లక్ష్యంజిల్లా పార్టీ అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తక్షణమే 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఇచ్చే మహాలక్ష్మి పథకానికి, నిరుద్యోగ భృతికి తగిన నిధులు కేటాయించకపోవడం మోసపూరితమన్నారు. ఈ బడ్జెట్ బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని విమర్శించారు.ఉద్యమం ఉధృతం చేస్తాంప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి, సవరించిన బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలని జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ




రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ బడ్జెట్ కేవలం అప్పుల కుప్పగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్, జిల్లా పార్టీ అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్, జిల్లా యువత అధ్యక్షులు సింగం అరుణ్ పటేల్, మహిళా అధ్యక్షురాలు నీరుడు షాలిని, బయ్యా వెంకటేష్, ప్రవీణ్ కుమార్, అంబాల శ్రీనివాస్, అభిరామ్, కమలాకర్, మహేష్ గౌడ్, మచ్చ పాండు గౌడ్, దుర్గ ప్రసాద్, సుల్తాన, మహేందర్ యాదవ్, జి కృష్ణ కుమార్, బాసీద్, అనిల్, మారుతి శ్రీనివాస్, మురళి, బన్నాపురం నాగరాజు, నర్సింగ్ రావు, కాసుల నందం గౌడ్, అనూప్, శ్రీనాద్, జిల్లా పార్టీ నాయకులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అభాగ్యులకు కెఎల్ఆర్ ట్రస్ట్ ఆపన్న హస్తం

**--మాతృదేవోభవ అనాథాశ్రమానికి రూ.10లక్షల వితరణ**

**--జీవితాంతం పేదలకు సహాయం అందిస్తా: కిచ్చెన్నలి**

**--ఐరన్, మెటీరియల్ అందటంపై నిర్వాహకులు గిరి కృతజ్ఞతలు.**

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 23 : పేదలకు, అభాగ్యులకు, పేద విద్యార్థులకు నిరంతరం కెఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా సేవ చేసే భాగ్యం కలగటం తన అదృష్టమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కెఎల్ఆర్ ట్రస్ట్ అధినేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి డివిజన్ నాదర్ గుల్ గ్రామంలోని మాతృదేవో భవ అనాథాశ్రమానికి రూ.10 లక్షల విలువ చేసే భవన నిర్మాణ ఇనుము సహా మెటీరియల్ అందజేశారు ట్రస్ట్ నిర్వాహకులు. అభాగ్యులు, నిరుపేదలు, మతిస్థిమితం లేని వారికి ఆశ్రమం కల్పిస్తున్న గట్టు గిరిని కేఎల్ఆర్ అభినందించారు. నూతన ఆశ్రమంలో జరుగుతున్న పనులను లక్ష్మారెడ్డి గతంలో పరిశీలించారు. తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.10లక్షల విలువైన మెటీరియల్ ను పంపటంతో అనాథాశ్రమ నిర్వాహకులు గట్టు గిరి సంతోషం వ్యక్తం చేశారు.సేవకుడే నాయకుడు: కాంగ్రెస్ నేతలుసేవకుడే నాయకుడు అంటూ పదేపదే మాట చెప్పే కిచ్చెన్నగారు... ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని నాదర్ గుల్ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పేదల కోసం కెఎల్ఆర్ ట్రస్ట్ స్థాపించి ఎందరికో



సేవ చేస్తున్నారని కొనియాడారు. ఓట్ల కోసం కాకుండా పేద విద్యార్థుల కోసం సైతం లిలీడ్ ఇండియా లి స్థాపించి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను, నైపుణ్య శిక్షణను నేటి తరానికి లక్ష్మారెడ్డి అందిస్తున్నారని మహేశ్వరనియోజకవర్గం హస్తం పార్టీ నేతలు గుర్తు చేశారు.

## చౌటుప్పల్ పట్టణంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలి

### - ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 23

చౌటుప్పల్ పట్టణంలో బాలుర కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు అన్నారు.సోమవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రజావాణిలో చౌటుప్పల్ పట్టణంలో వెనుకబడిన తరగతుల బాలుర కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల అధ్యక్షులు దాసరి ప్రకాష్ తో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ హైదరాబాద్ అతి దగ్గరలో ఉన్న చౌటుప్పల్ పట్టణంలో కళాశాల వసతి గృహం లేక విద్యార్థులు దూరమయ్యే పరిస్థితి, చౌటుప్పల్ పట్టణంలో పది నుండి 12 డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మారుమూల గ్రామాల నుండి విద్యార్థులు రోజు మూడు వేల నుండి 5000 మంది విద్యార్థులు చదువుకోవడానికి చౌటుప్పల్ పట్టణానికి వస్తుంటారు గ్రామాల నుండి సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థుల సమయానికి కళాశాలలకు చేరుకునే పరిస్థితి లేదు,కళాశాల వసతిగృహ ఉంటే విద్యార్థులు చదువులు అభ్యసించడం జరుగుతా ఉన్నది కావున ప్రభుత్వం వెంటనే స్పందించి చౌటుప్పల్ పట్టణంలో కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నారు.....



## ఉదయాన్నే వేడినీటిలో దీన్ని కలిపి తాగితే శరీరంలో అద్భుత మార్పులు.. లైట్ తీసుకుంటే..

నెయ్యి, వేడి నీరు, పసుపు, నల్ల మిరియాలు కలిపిన ఈ డ్రింక్ ఖాళీ కడుపుతో తీసుకుంటే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. పసుపులోని కర్క్యుమిన్, మిరియాల పైపెరిన్ రోగనిరోధక శక్తిని పెంచి, కీళ్ల నొప్పులను నివారిస్తుంది. ఉదయాన్నే వేడినీటిలో దీన్ని కలిపి తాగితే శరీరంలో అద్భుత మార్పులు.. లైట్ తీసుకుంటే.. సాధారణంగా నెయ్యి, వేడి నీటిని కలిపి ఖాళీ కడుపుతో తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని అంటారు. అయితే ఈ మిశ్రమానికి చిటికెడు పసుపు, నల్ల మిరియాల పొడిని కలిపి తీసుకుంటే శరీరంలో ఊహించని మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ అద్భుతమైన పానీయం రోగనిరోధక వ్యవస్థ, జీర్ణవ్యవస్థకు ఎలా మద్దతు ఇస్తుందో డైటీషియన్ డాక్టర్ అర్చన బాత్రా వివరిస్తున్నారు. మలబద్ధకం నుండి రోగనిరోధక శక్తి వరకుజీర్ణవ్యవస్థకు ..నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. గోరువెచ్చని నీటితో నెయ్యి కలిసిన ప్పుడు, ఇది జీర్ణవ్యవస్థకు కందెనలా పనిచేస్తుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించడంలో, ప్రేగుల ద్వారా ఆహార కదలికను మెరుగుపరచడంలో అద్భుతంగా సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరం డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు మద్దతు ఇస్తుంది. కొవ్వులో కరిగే విషాన్ని శరీరం నుండి బయటకు తీసుకెళ్లడంలో సహాయపడుతుంది.ఇమ్యూనిటీపసుపులో లభించే కర్క్యుమిన్ అనే సమ్మేళనం శక్తివంతమైన శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. కర్క్యుమిన్ శరీరం ద్వారా సులభంగా గ్రహించబడదు. అందుకే నల్ల మిరియాలలో ఉండే పైపెరిన్ అనే క్రియాశీల సమ్మేళనం, కర్క్యుమిన్ శోషణను అసాధారణంగా పెంచడంలో సహాయపడుతుంది. నెయ్యి వంటి ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకుంటే ఇది శరీరంలో మంటతో పాటు కీళ్ల నొప్పులను నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.



తరచుగా జలుబు లేదా గొంతు నొప్పితో బాధపడేవారు ఈ పానీయాన్ని తీసుకోవడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.ఎవరు తాగొద్దు ఈ డ్రింక్ సాధారణంగా ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ కొందరికి ఇది మంచిది కాకపోవచ్చు. పిత్తాశయ సమస్యలు, అధిక ఆమ్లత్వం, అధిక జిడ్డుగల చర్మం ఉన్నవారు ఈ పానీయాన్ని తీసుకునే ముందు తప్పనిసరిగా నిపుణుల సలహా తీసుకోవాలి. జీవక్రియలు నెమ్మదిగా ఉన్నవారు, నెయ్యిని ఎక్కువగా తీసుకుంటే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొత్త అలవాటును ప్రారంభించే ముందు ఎల్లప్పుడూ వైద్య నిపుణులు లేదా డైటీషియన్ సలహా తీసుకోవడం మంచిది.ఉదయాన్నే వేడినీటిలో దీన్ని కలిపి తాగితే శరీరంలో అద్భుత మార్పులు.. లైట్ తీసుకుంటే.. నెయ్యి, వేడి నీరు, పసుపు, నల్ల మిరియాలు కలిపిన ఈ డ్రింక్ ఖాళీ కడుపుతో తీసుకుంటే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరచడం తో పాటు మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. పసుపులోని కర్క్యుమిన్, మిరియాల పైపెరిన్ రోగనిరోధక శక్తిని పెంచి, కీళ్ల నొప్పులను నివారిస్తుంది. సాధారణంగా నెయ్యి, వేడి నీటిని కలిపి ఖాళీ కడుపుతో తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని అంటారు. అయితే ఈ మిశ్రమానికి చిటికెడు పసుపు, నల్ల మిరియాల పొడిని కలిపి తీసుకుంటే శరీరంలో ఊహించని మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఈ అద్భుతమైన పానీయం రోగనిరోధక వ్యవస్థ, జీర్ణవ్యవస్థకు ఎలా మద్దతు ఇస్తుందో డైటీషియన్ డాక్టర్ అర్చన బాత్రా వివరిస్తున్నారు. మలబద్ధకం నుండి రోగనిరోధక శక్తి వరకుజీర్ణవ్యవస్థకు.

.నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. గోరువెచ్చని నీటితో నెయ్యి కలిసినప్పుడు, ఇది జీర్ణవ్యవస్థకు కందెనలా పనిచేస్తుంది.



## చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ రంజిత్ రెడ్డి కి మాతృవియోగం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 23 : చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ రంజిత్ రెడ్డి తల్లి గడ్డం చంద్రకళమ్మ పరమపదించారని తెలిసి, వారి నివాసానికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా దుఃఖిత కుటుంబ సభ్యులకు ఆమె తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



### తాట్లవాయి లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 23

జగిత్యాల జిల్లా తాట్లవాయి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు పశువులకు ఉచితముగ ప్రాథమిక పశువైద్య కేంద్రం భూపతిపూర్ వారి ఆధ్వర్యంలో వేసినారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ శ్రీ ఆకుల మల్లేశం, ఉప సర్పంచ్ మరుపాక నారాయణ, వార్డు సభ్యులు రాజోల్ల లహరి మహిపాల్, పాలేపు సురేష్, కొండవేణి హేమశ్రీ, గంగాధర్, గాండ్ల లతిక, అంజిత్, చుక్క పెద్దులు, పశు వైద్య సిబ్బంది శ్రీ మహమ్మద్ ఆజం ఖాన్, ఎల్ ఎస్ ఏ శ్రీ గంగా చారి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, ఖాలిక్ సంతోష్, బుచ్చన్న, స్థానిక రైతులు గణపతి, జీవన్, గంగారెడ్డి, రాజారెడ్డి, రవి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## చలికాలంలో గుండెపోటు ప్రమాదం ఎందుకు పెరుగుతుంది? అసలు కారణాలు ఇవే!



చలికాలంలో శరీరం ఇప్పటికే వెచ్చగా ఉండటానికి జీవక్రియను పెంచడానికి ప్రయత్నిస్తుంది. మనం మార్నింగ్ వాక్ చేయవలసి వస్తే ఉదయం చలి నుండి మనల్ని మనం రక్షించుకోవాలి. మన తల, చెవులు, చేతులు, కాలి వేళ్లను కప్పుకోవాలి. మీ ఛాతీ.. గుండెపోటు వచ్చిందంటే చాలు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. కొన్ని సార్లు ఒక్కసారి వచ్చిన గుండెపోటుతోనే మరణాలు సంభవిస్తుంటాయి. ఒకసారి వచ్చి వెళ్లిందంటే జాగ్రత్తగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు వైద్య నిపుణులు. ఈ మధ్య కాలంలో గుండెపోటు వచ్చేవారి సంఖ్య పెరిగిపోతోంది. ఉన్నట్టుండి గుండె పోటు వచ్చి కుప్పకూలిపోతున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గుండెపోటు రాగానే నిమిషాల్లో ఆస్పత్రికి చేరిస్తే గోల్డెన్ అవర్స్‌గా భావిస్తారు. ఇక చలికాలంలో గుండె సమస్యలు పెరుగుతాయి. గుండె సంబంధిత వ్యాధులున్నవారు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఉదయాన్నే చలి మీ గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ప్రత్యేకించి ఎవరైనా వార్మప్ లేకుండా వ్యాయామం చేస్తే లేదా సరిగ్గా దుస్తులు ధరించకపోతే ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. ఎపినెఫ్రిన్, నోర్‌పైన్‌ఫ్రైన్, కార్టిసాల్ వంటి కొన్ని హార్మోన్ల స్రావం పెరగడం వల్ల చాలా వరకు గుండెపోటులు ఉదయం 4 నుండి 10 గంటల మధ్య వస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి ఆక్సిజన్ డిమాండ్, రక్తపోటు పెరుగుదలను ప్రేరేపిస్తాయి. ఇది కాకుండా ఎండోథెలియల్‌ప్రొజెనిటర్ కణాల స్థాయి తగ్గడం కూడా గుండెపోటు అవకాశాలను పెంచుతుంది.

## శీతాకాలంలో డి-విటమిన్ లెవెల్స్ పెంచే 3 ఫుడ్ సీక్రెట్స్! ఎండతో పనేలేదు

ఆరోగ్యానికి అత్యంత అవసరమైన పోషకాల్లో విటమిన్-డి కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం ఎముకల బలానికే కాకుండా, కాల్షియం, ఫాస్ఫరస్‌లను శరీరం గ్రహించేలా చేసి, రోగనిరోధక వ్యవస్థను శక్తివంతం చేస్తుంది. విటమిన్-డి మన మానసిక స్థితిని, శక్తి స్థాయిలను కూడా ప్రభావితం చేస్తుంది. అయితే, చలికాలంలో సూర్యరశ్మి తక్కువగా దొరుకుతున్నందున, కేవలం ఎండపైనే ఆధారపడకుండా, విటమిన్-డి స్థాయిలను పెంచుకునేందుకు ఆహార మార్గాలు తప్పనిసరి. విటమిన్-డి లోపం చాలా నెమ్మదిగా మొదలవుతుంది. అందుకే అలసట, బలహీనమైన ఎముకలు వంటి లక్షణాలు త్వరగా కనిపించవు. వృద్ధులు, రాత్రి షిఫ్టుల్లో పనిచేసేవారు, ఎక్కువగా ఇళ్లలోనే గడిపేవారు, నలుపు రంగు చర్మం ఉన్నవారు, పూర్తిగా శాకాహారం తీసుకునేవారు ఈ లోపానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఈ లోపం రాకుండా చూసుకోవాలంటే, నిత్యం కొన్ని ఆహార మార్పులు చేసుకోవడం ఉత్తమం.కొవ్వు చేపలు, పుట్టగొడుగులే కీలకంసూర్యరశ్మి సరిగా లేనప్పుడు ఆహారమే ప్రధాన ఆధారం. సాల్మన్, ట్యూనా, మాకరెల్ వంటి కొవ్వు అధికంగా ఉన్న చేపల్లో విటమిన్-డి పుష్కలంగా లభిస్తుంది. ఈ చేపలను వారానికి కనీసం ఒకటి రెండు సార్లు తీసుకుంటే, శరీరానికి కావాల్సిన విటమిన్-డి మోతాదు సులువుగా అందుతుంది. అంతేకాదు, వీటిలో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు, గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శాకాహారులకు అత్యుత్తమ మార్గం పుట్టగొడుగులు (మష్రూమ్స్). కొన్ని రకాల పుట్టగొడుగులు కిరణాలకు గురైనప్పుడు విటమిన్-డి2ను ఉత్పత్తి చేస్తాయి. అలాగే, గుడ్డు పచ్చసొనలోనూ కొంతమేర విటమిన్-డి నిల్వ ఉంటుంది.